సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 4 । జూలై । 2023



భారీ వర్షం

జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి

IIలో



అభివృద్ధి లక్ష్యంతో సీసీ రోడ్లు

గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంతోనే రూ.40 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని ఎంపీ భీశెట్టి సత్యవతి, ధర్మశ్రీ తెలిపారు.

IIలో

మళ్లీ చోరీకి యత్నం



సుందరయ్యపేట శివారు ఆనంద పురం గ్రామంలో ఒకే ఇంట్లో ఆదివారం రాత్రి రెండోసారి చోరీకి యత్నించారు.

IIలో

న్యూస్‌రీల్

ఎస్పీ 'స్పందన'కు 35 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 35 అర్జీలు స్వీకరించినట్టు అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ తెలిపారు. ఈ ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'సురక్ష'

యలమంచిలి: చిన్నచిన్న సాంకేతిక సమస్యల వల్ల పథకాలందని అర్హులందరికీ సురక్ష ద్వారా మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు.యలమంచిలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో సోమవారం నిర్వహించిన జగన్న సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు.అర్హత ఉన్నా ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, కౌన్సిలర్లు అధికారలు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలోకి ప్రవేశించకుండా వివక్ష

ఆర్డీవోకు సర్పంచ్ ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు

నర్సీపట్నం: రామాలయంలోకి రానివ్వకుండా వివక్ష చూపుతున్నారంటూ నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామ సర్పంచ్(వైఎస్సార్‌సీపీ) గొంప కన్నయ్యనాయుడు సోమవారం ఆర్డీవో హెచ్.వి.జయరాంకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామ ప్రథమ పౌరుడునైన తనకే ఈ విధమైన చేదు అనుభవం ఎదురైతే, తాను ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు. రామాలయం ప్రజలందరిదీ అయినప్పటికీ రాజకీయంగా ఒక వర్గం తనను కావాలని అడ్డుకుంటున్నారని, దీనిపై తగు విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో ప్రజల మధ్య తగదాలు సృష్టించటం తనకు ఇష్టం లేకే అధికారుల దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని విన్నవించారు.

గాంధీ సెంటర్ డైరెక్టర్‌గా సీతామాణిక్యం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సీతామాణిక్యం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకురాలిగా న్యాయ కళాశాల ఆచార్యులు డాక్టర్ కె.సీతామాణిక్యం నియమితులయ్యారు. సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి ఉత్తర్వులు స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ గాంధీ అధ్యయన కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేయాలని, గాంధీజీ ఆలోచనలను యువతలోనికి తీసుకువెళ్లే దిశగా పనిచేయాలన్నారు. ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో (ఇగ్నో) ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.https: //ignou admission. samasth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రవేశాలకు దరఖాస్తు గడువు జూన్ 30 చివరి తేదీగా కాగా ఈనెల 15వ వరకు పొడిగించారన్నారు.



● అపురూపం...

ఆకుకూరలు, కాయగూరలను ఆభరణాలుగా అలంకరించుకుని అమ్మ శాకంబరిగా దర్శనమిచ్చింది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ అమ్మవారిని సోమవారం కూరగాయలతో అలంకరించారు. అర్చకులు భోగ్గారపు వెంకట రమణ , బాబు ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, పాలిమేర శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

-అనకాపల్లిటౌన్



● సాయి శరణం

జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. షిర్డీసాయిబాబా ఆలయాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చోడవరం పట్టణంలోని సాయి మందిరంలో ఉదయం క్షీరాభిషేకం, రుద్రాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జరిపిన లక్ష తులసి పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన చేశారు. బాబా ఉత్సవ విగ్రహంతో తిరువీధి ఉత్సవాన్ని వేడుకగా జరిపారు.

-చోడవరం రూరల్

పేదల సొంతింటి కల సాకారమే సీఎం ఆకాంక్ష



టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కన్నబాబురాజు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

- ఒక్క రూపాయికే రూ.10లక్షల విలువ చేసే గృహం
- ఎర్రవరం టిడ్కో గృహ సముదాయ ప్రారంభోత్సవంలో మంత్రి ఆదిమూలపు సురేష్

సాక్షి, అనకాపల్లి: రాష్ట్రంలో ప్రతి పేదవాని సొంతింటి కలను సాకారం చేయాలన్నదే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఒక్క రూపాయికే రూ.10 లక్షల విలువ చేసే గృహాలు అందించామన్నారు. రానున్న ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేయనున్నట్టు చెప్పారు. యలమంచిలిలోని ఎర్రవరం సమీపంలో హైవే వద్ద నిర్మాణం పూర్తిచేసిన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఎమ్మెల్యే కన్నబాబురాజు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిలతో కలిసి మంత్రి ఆదిమూలపు సురేష్ సోమవారం ప్రారంభించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, ప్లాట్ తాళాలు అందజేశారు. సదుపాయాల గురించి లబ్ధిదారులను ఆరా తీశారు. వారంతా బాగున్నాయని చెబుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సొంతింట కల నెరవేరడంతో వారిలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అనంతరం టిడ్కో గృహసముదాయంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. వర్షం రావడంతో అక్కడి నుంచి యలమంచిలిలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకుని మిగిలిన లబ్ధిదారులకు ప్లాట్ రిజిస్ట్రేషన్ పత్రాలను, నమూనా తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా యలమంచిలి టిడ్కో గృహ సముదాయంలో 432 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందజేసినట్టు చెప్పారు. 432 గృహాల్లో 300 చదరపు గజాల ఇళ్లు 96.., 365 చదరపు గజాల ఇళ్లు 144.., 430 చదపుగజాల ఇళ్లు 192 ఉన్నాయని, మొత్తం 4.75 ఎకరాల్లో రూ.37.07 కోట్లు వెచ్చించి ఇళ్లు నిర్మించినట్టు చెప్పారు. 417 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, మిగిలిన 15 గృహాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులకు ఆదేశించామన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కన్నబాబురాజు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్య దొర, మున్సిపల్ వైఎస్ చైర్మన్ అర్రెపు గుప్త, యలమంచిలి సచివాలయ పట్టణ కన్వీనర్ కర్రి శివ శంకర్, యలమంచిలి రూరల్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, తహసీల్దార్ రాణీ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆ భూమికి పట్టాలివ్వలేం

- సాగుహక్కు పత్రాలకు టైటిల్ డీడ్ ఉండాలి
- సాగులో ఉన్నంత మాత్రాన జిరాయితీ పట్టాలివ్వలేం
- పనలసపాడు రెవెన్యూల్లో టైటిల్ డీడ్ ఉన్న గెమ్మిలి కుటుంబాలకు తొమ్మిది పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాం
- పట్టాదారుల పాస్ పుస్తకాల జారీలో ఏ రాజకీయ నాయకుల ప్రమేయం లేదు
- రోలుగుంట తహసీల్దార్ వరహాలు

రోలుగుంట: 'పేదల భూములపై పెద్దల కన్ను' పేరిట ఈనాడు దినపత్రికలో ప్రచురించిన వార్తా కథనంలో వాస్తవం లేదని.. ఈనాడు రాతలను రెవెన్యూ అధికారులు సోమవారం ఖండించారు. రోలుగుంట మండలం రత్నంపేట పరిధి పనసలపాడు రెవెన్యూ పరిధిలోని 360 ఎకరాల అటవీ బంజరును రత్నంపేట గ్రామానికి చెందిన దళితులు ఏళ్ల తరబడి సాగు చేస్తున్నారని ప్రచురించారు. అది అవాస్తవం. ఈ భూమి జిరాయితీ భూమి. ఇక్కడ 28 మంది వరకూ దళితలు సాగు చేసుకుంటున్నారని, జిరాయితీ భూమిని ఎటువంటి ఆధారాలు లేకుండా సాగుదారులకు ఇచ్చే అధికారం రెవెన్యూ పరిధిలో అంశం కాదన్నారు. ఇటువంటివి ఏమైనా ఉంటే న్యాయస్థానంలో తీర్పు ఆధారంగానే నిర్ణయాలుంటాయన్నారు. సాగు హక్కు పత్రాలకు టైటిల్ డీడ్ ఉండాలి. సాగులో ఉన్నంత మాత్రాన జిరాయితీ భూమిలో పట్టాలివ్వలేం. ధర్నాలతో పనసలపాడు రెవెన్యూలో టైటిల్ డీడ్ లేని గిరిజన, బలహీన వర్గాలవారిని మభ్యపెట్టి కొన్ని సంఘాలు తప్పుదోవ పట్టించడం మంచివిధానం కాదని తహసీల్దార్ కె.వరహాలు తెలిపారు. సోమవారంఒక పత్రికలో పేదల భూములపై పెద్దల కన్ను అని వచ్చిన శీర్షికపై అతన్ని కలసిన 'సాక్షి'తో మాట్లాడారు.

అలాగే పై రెవెన్యూలో పట్టాలు పంపిణీలో ఏ రాజకీయ పార్టీ నాయకుల ప్రమేయం లేదన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులతోపాటు రెవెన్యూ అధికారుల కుమ్మక్కయారన్నది అవాస్తవమన్నారు. పనసలపాడు రెవెన్యూలో స్థానికంగా ఉండి సాగులో ఉండి టైటిల్ డీడ్ ఉన్న తొమ్మిది మంది గెమ్మిల కుటుంబాల భూములను జగనన్న శాశ్వత భూహక్కు పథకం కింద రీసర్వే వారికి ఈ జిరాయితో భూమికి చెందిన తొమ్మిది కుటుంబాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. పనసలపాడు రెవెన్యూలో 1, 3, 4, 6, 8.11/3 తదితర సర్వే నంబర్ల సాగులో బొల్లం చిలుకు, సోంబాబు, అప్పారావు, నూకరాజు, రాజాన శ్రీను, రాజేశ్వరి, ఆర్లె తాతలు, లోవరాజు, అప్పారావు, సాయిలక్ష్మి, అచ్చియ్యమ్మ తదితరుల సాగు చేసుకుంటున్న 20 నుంచి 25 ఎకరాలు డిస్ప్యూట్‌లో ఉందన్నారు. వీరి వద్ద ఏ విధమైన టైటిల్ డీడ్ లేక తాము ఏమీ చేయని పరిస్థితి ఉందన్నారు. స్థానికేతరులు సాగు లేకుండా, ఏ విధమైన టైటిల్ డీడ్ లేకుండా తాము సాగు హక్కులు కల్పించడం, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చామనడంలో వాస్తవం లేదన్నారు. ఈ రెవెన్యూలో సెటల్‌మ్మెంటు రిజిస్ట్రేషన్ కింద బల్లగొండ హిమాంబికి చెందిన భూమిలో కొంత మైథిలీకుమారికి సేల్ చేసినందున ఆమె పేరున పట్టాదారు పాస్ పుస్తకాలను వారి అర్హత మేరకు రీసర్వే జరిగిన వాటికి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చామన్నారు. అయితే హిమాంబికి ఇక్కడ ఇంకా అన్ని హక్కులు కలిగిన భూమి ఉందన్నారు. ఇందులో అధికార పార్టీ నాయకుల ప్రమేయం, వారితో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారన్నది వాస్తవం కాదన్నారు. రోలుగుంట మండలం నాన్ షెడ్యూల్‌గానే ఉందన్నారు. ఇక్కడ ఐటీడీఏకి సంబంధించి ఏ విధమైన రాయితీలు గతంలో కాని, ఇప్పుడు కాని లేవని స్పష్టం చేశారు. ప్రధానంగా తాము మండలంలోని పలు రెవెన్యూల్లో జిరాయితీ భూములకు టైటిల్ డీడ్ లేకుండా ఏ విధమైన సాగు హక్కులు పొందాలన్నా ఉన్నతాధికారుల ఆదేశం తప్పదని వివరించారు. ఇప్పటికైనా వీరిని తప్పుదోవ పట్టించే విధానాలను వారికి వంతపాడుతున్నవారు విరమించుకుని వారికి మేలు చేసే విధంగా నడుచుకోవాలని, అందుకు తమ సహకారం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. గత నెల 30న రత్నంపేటలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లిన సమస్యపై తాను పరిష్కార మార్గంపై వివరించినా పత్రికల్లో కథనాలు రాయించడం తప్పుతోవ పట్టించడమే అవుతుందన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వరహాలు

అప్పన్న ఆలయంలో ఢిల్లీ విజయోత్సవం

సింహాచలం : ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం ఢిల్లీ విజయం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజా చార్యులు తన పాండిత్యంతో ఢిల్లీ బాద్‌షాను మెప్పించిన రోజు ఆషాఢ పౌర్ణమి కావడంతో ఏటా ఆరోజు శ్రీ వైష్ణవ ఆలయాల్లో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా ప్రముఖ శ్రీవైష్ణవ దేవాలయమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఢిల్లీ విజయం ఉత్సవాన్ని నిర్వహించారు. భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి సాయంత్రం 4 గంటలకు ఆలయ బేడామండపంలో ఉన్న హంసమూలన అధిష్ఠింపజేశారు. ఆయన వైభవాన్ని కీర్తిస్తూ వైభవపారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పల్లకిలో బేడా తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ,అర్చకులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు.

ప్రతీ స్పందన అర్జీపై విచారణ



అర్జీలు స్వీకరిస్తున్న, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన ప్రతీ అర్జీపై విచారణ చేపట్టి, పరిష్కరించడంతో పాటు అర్జీదారుడికి స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డితో పాటు డీఆర్వో వెంకటరమణ, డీఎల్‌డీవో మంజులావాణి ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. భూ సమస్యలకు సంబంధించిన విన తులు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. మొత్తం 293 వినతులు స్వీకరించారు. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కలెక్టరేట్ గేటు వద్ద పలుసమస్యలపై నిరసనలు వ్యక్తం చేశారు. రూరల్ ఎస్ఐ నర్సింహారావు భద్రతా చర్యలు చేపట్టారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



వీరనారాయణంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: సత్వరమే సమస్యలు పరిష్కరించేందుకు జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని వీరనారాయణం సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష పథకం తీసుకువచ్చారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 294 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజరామ్, సర్పంచ్ ఎల్లపు కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, మాజీ సర్పంచ్ తూరుబిల్లి సత్తింబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విస్సారపు రామారావు, పీఏసీఎస్ సీఈవో తూరుబిల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మాడుగుల పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, ఎంపీడీవో మీనాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



అర్జునగిరిలో లబ్ధిదారునికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: అర్హత ఉన్న ఏ ఒక్క కుటుంబం చిన్న చిన్న సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలు కోల్పోకూడదన్న ఉద్దేశంతో జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని అర్జునగిరిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అర్జునగిరి సచివాలయం పరిధిలో గల అర్జునగిరి, చీడిపల్లిలో పంచాయతీల్లో 794 ధ్రువీకరణ పత్రాలను జారీ చేసినట్టు అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు.

పలువురు లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నియోజక వర్గ పరిశీలకులు ఉరికూటి అప్పారావు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, అర్జునగిరి, చీడిపల్లి సర్పంచ్‌లు బి.రమాదేవి, కసిరెడ్డి సూర్యనారాయణ, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

కశింకోట: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని జెట్టపురెడ్డితుని, జి. భీమవరం సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కుల, ఆదాయ, ఇతర ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జెట్టపురెడ్డితునిలో సుమారు 1060 ఇళ్లు ఉండగా వాటిలో వెయ్యి ఇళ్లను సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు కలిపి సర్వే చేసి 450 మందికి ఒక రోజులో ధ్రువీకరణ పత్రాలు అందజేశారని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజల హితం కోరి పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేలా అంతా కృషి చేయాలన్నారు. చింతలపాలెం, సింగవరం తదితర లేఅవుట్లు దూరం కావడం వల్ల లబ్ధిదారులు ముందుకు రాని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించి ఇళ్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జి. భీమవరం, సుందరయ్యపేట, శివారు చిన్నయ్యపాలెం గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.60 లక్షలతో మూడు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. జి. భీమవరంలో గడచిన మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి 24 గంటల్లోగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు అధ్యక్షత వహించిన ఎంపీపీ కలగా లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి వద్దకే సేవలందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ కుల, మత, పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, జెట్టపురెడ్డితుని సర్పంచ్ కోన అరుణ, జి. భీమవరం సర్పంచ్ హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, టీటీ సురేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు చిన్నోడు, మేరీజోన్స్ తదితరులు పాల్గొన్నారు.



జెట్టపురెడ్డితునిలో కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

పరిశ్రమలపైనా విషమే!


- ఉమ్మడి విశాఖలో పనిచేస్తున్నది సీనియర్లే..
- జూనియర్లకే బాధ్యతలంటూ ఈనాడు తప్పుడు రాతలు

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్న పచ్చ పత్రిక ఈనాడుకు ఇప్పుడు పరిశ్రమల వంతొచ్చింది. ఉమ్మడి విశాఖలోని పరిశ్రమల పర్యవేక్షణకు సీనియర్లకు బదులు జూనియర్లే ఉన్నారంటూ అసత్య కథనాన్ని ప్రచురించింది. అందువల్లే ఈ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటూ బురద జల్లింది. తాజాగా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదాన్ని ఆసరాగా చేసుకుని అవాస్తవాలను వండి వార్చింది. 'తప్పు ఎవరిది?' అంటూ ఓ అసత్య కథనాన్ని ప్రచురించింది. ఇలాంటి ప్రమాదాలకు భద్రతా ప్రమాణాల తనిఖీల అంశంలో అనుభవజ్ఞులైన అధికారులుండాలని, కానీ ఎన్నో పరిశ్రమలున్న ఉమ్మడి విశాఖలో మాత్రం జూనియర్లే పని చేస్తున్నారని, ఒంగోలు, కర్నూలు, కడపలాంటి చోట్ల సీనియర్లు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొంది. వాస్తవానికి ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిశ్రమల భద్రతను పర్యవేక్షించే జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి పరిశ్రమల శాఖలోనే రెండో సీనియర్‌అధికారి. ఈ శాఖలో కాబోయే డైరెక్టర్ కూడా ఆయనే అవుతారని ఇతర అధికారులు చెబుతున్నారు. అలాగే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు కూడా సీనియర్ అధికారే. ప్రస్తుతం ఉన్న ఇన్‌స్పెక్టర్లలో ఆయనే సీనియర్. ఆయన సీనియారిటీని గుర్తించే శ్రీకాకుళం నుంచి విశాఖకు మళ్లీ బదిలీ చేశారని ఆ శాఖ అధికారులు ఉదహరిస్తున్నారు. విశాఖతో పోల్చుకుంటే పరిశ్రమలు అంతగా లేని కడప, కర్నూలు, ఒంగోలుల్లో సీనియర్ అధికారులే ఉన్నారని ఈనాడు కథనంలోపేర్కొన్నారు. కానీ కడప, కర్నూలుల్లో పనిచేస్తున్న ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌లు ఇక్కడి వారికంటే జూనియర్లే. కానీ వాస్తవాలకు విరుద్ధంగా ఈనాడు తప్పుడు కథనాలు రాస్తుండడంపై పరిశ్రమలశాఖఅధికారులుమండిపడుతున్నారు.

లోపాల పరిశ్రమలకు నోటీసులు : ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో భాగంగా తరచూ సేఫ్టీ ఆడిట్‌ను నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కూడా సేఫ్టీ ఆడిట్ నిర్వహించి లోపాలను సరిదిద్దుకోవాలని అనకాపల్లి జిల్లాలోని 186, విశాఖ జిల్లాలోని 53 పరిశ్రమలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో లోపం లేదని, చాలా సందర్భాల్లో ప్రమాదాలకు ఆయా సంస్థల నిర్లక్ష్యం లేదా తప్పిదాలే కారణమని వీరు చెబుతున్నారు. కాగా ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే గాలి వల్ల గాని, వదిలిన నీరు వల్ల గాని ప్రమాదాలు వాటిల్లకుండా తాము పర్యవేక్షిస్తున్నామని, విశాఖ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ నాగిరెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

సాహితీపై గతంలోనే కేసులు

ఇటీవల ప్రమాదం జరిగిన సాహితీ ఫార్మాలో భద్రతా ప్రమాణాలు సరిగా పాటించడం లేదని తేలడంతో ఆ కంపెనీపై అధికారులు కేసు నమోదు చేశారు. సాహితీ ఫార్మాలో నైపుణ్యం లేని సిబ్బంది (అన్ స్కిల్డ్) పనిచేస్తున్నారని, ల్యాబ్ నిపుణుడు కూడా లేరని పరిశ్రమల శాఖ అధికారులు గుర్తించారు. ఇలాంటి వారి వల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, దీనిపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. మరోవైపు సాహితీ ఫార్మాలో డిస్టిల్డ్ సాల్వెంట్ లోడింగ్‌లో విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల కారణంగా తలెత్తిన లోపం వల్ల గాని, వ్యాక్యూమ్ పంపు ఫెయిల్ అవడంతో హఠాత్తుగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల గాని ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనాకొచ్చారు. మరింత సమగ్రత కోసం లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ప్రధాన కారణంపై వారం, పది రోజుల్లో పూర్తి స్థాయి నిర్ధారణకు రానున్నారు.



అనుభవరాహిత్యం అవాస్తవం

ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పర్యవేక్షించే అధికారుల్లో అనుభవం లేని వారే ఉన్నారంటూ ఈనాడులో వచ్చిన కథనంలో వాస్తవంలేదు. ఇక్కడ అత్యంత అనుభవం, సమర్థత ఉన్న ఉన్నతాధికారులే పనిచేస్తున్నారు. వీరినేతృత్వంలో తరచూ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలనుపర్యవేక్షిస్తున్నారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహిస్తూ వాటిలోలోపాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నారు. నిర్లక్ష్యంలేకుండా మా శాఖ అధికారులంతా అంకితభావంతో పనిచేస్తున్నారు.



-వి.సురేష్, డిప్యూటీచీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, విశాఖపట్నం

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి ఒకరి మృతి


కీర్తి వెంకటేష్ మృతదేహం

పాయకరావుపేట: సత్యవరం గ్రామానికి చెందిన కీర్తి వెంకటేష్ (62) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్టు ఏఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. మృతుడు కీర్తి వెంకటేష్ సోమవారం సాయంత్రం తన తమలపాకు తోట వద్ద వర్షాలకు తెగి పడి వున్న 240 వోల్టులు కలిగిన విద్యుత్‌తీగ కాలికి తగలడంతో షాక్ గురై మరణించాడని తెలిపారు. మృతుని కుమారుడు నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతుడు మణికంఠ సాయి కుమార్

పాయకరావుపేట: పట్టణంలోని బృందావనానికి చెందిన కోనేటి మణికంఠ సాయికుమార్ (25) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఏఎస్‌ఐ గోవిందు తెలిపారు. మణికంఠ ఇద్దరు చెల్లెళ్ల వివాహానికి రూ.3 లక్షలు అప్పు చేయడంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగుల్లో మరో రూ.40 వేలు పోగొట్టుకోవడంతో అప్పుల బాధతో గత నెల 30న గడ్డి మందు తాగాడు. అతనిని తుని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి సోదరి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్ వద్ద పడి ఉన్న మృతదేహం

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన కాటేజ్ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని జీఆర్‌పి ఎస్‌ఐ వర్మ తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఆయన సోమవారం రైల్వే ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 25 ఏళ్లు ఉంటుందని, సంఘటన ఆదివారం రాత్రి జరిగి ఉంటుందని, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్ర పరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని, మృతుని వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐలు మోహన్, మూర్తి పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంతో సీసీ రోడ్లు

- అనకాపల్లి ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- 8 గ్రామాల్లో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు ప్రారంభం

రావికమతం: మండలంలో మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంతోనే రూ.40 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామని ఎంపీ భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చీమలపాడు పంచాయతీ తాటిపర్తి, కొంజుర్తి, సి.కె.పాడు తదితర ఎనిమిది గ్రామాల్లో సోమవారం వారు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీరోడ్లను ప్రారంభించారు. ఈ క్రమంలో జెడ్.కొత్తపట్నం – కొత్తకోట రోడ్డు అధ్వానం ఉందని గ్రామస్తులు విన్నవించడంతో నిధులు మంజూరు చేస్తామని, కొంజుర్తిలో మరో రూ.5 లక్షలు సీసీరోడ్డుకు కేటాయిస్తామని ఎంపీ, విప్ హామీ ఇచ్చారు.


కొంజుర్తిలో సీసీరోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

పిడుగు బాధితులకు పరామర్శ:
తాటిపర్తిలో పిడుగు పాటుతో అస్వస్థతకు గురైన 11 మంది కుటుంబాలను విప్ ధర్మశ్రీ సోమవారం పరామర్శించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులందరికీ క్షేమంగానే ఉందని తెలుసుకున్నారు.

విత్తనాల పంపిణీ ప్రారంభం:
జెడ్.కొత్తపట్నం ఆర్బీకేలో వరి విత్తనాలను ఎంపీ సత్యవతి పంపిణీ చేశారు. రైతులందరూ సబ్సిడీ విత్తనాలను సద్వినియోగించుకోవాలని, ఎరువులు అధిక మోతాదులో వాడవద్దని సూచించారు. సర్పంచ్ వంజరి గంగరాజు, ఎంపీటీసీ చిన్ని చినమ్మలు, చోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ పైల రాజు, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్స భవానీప్రసాద్, గ్రామీణ తాగునీటి సరఫరా డీఈ కృష్ణ, పీఆర్ డీఈ ప్రసాద్ పాల్గొన్నారు.


తాటిపర్తిలో పిడుగు ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన అనంతరం తొలిసారి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌ను సోమవారం మాకవరపాలెంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఎమ్మెల్యేతోపాటు మండల నాయకులంతా ఘనంగా సత్కరించారు. ప్రసాద్ కూడా ఎమ్మెల్యేను సన్మానించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ రమణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
మునగపాక: అనకాపల్లి నుంచి మునగపాక వరకు ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడేలా పాటుపడతానన్నారు. ప్రతీ ఎమ్మెల్యే, ఎంపీని సమన్వయం చేసుకుని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమిస్తానన్నారు. త్వరలో జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. మునగపాక ఎంపీటీసీ–2 సూరిశెట్టి రాము పాల్గొన్నారు.


మాకవరపాలెంలో ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఇతర నాయకులు

బాల్య వివాహాల నిర్మూలనలో కృషి ప్రశంసనీయం

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: బాల్య వివాహాలు రూపుమాపేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సీడ్, కె.ఎస్.సి.ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నేరం, తస్మాత్తు జాగ్రత్త అంటూ రూపొందించిన పోస్టర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వైద్యాధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢ నమ్మకాలను పోగొట్టేందుకు బాల్య వివాహాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు అన్ని విధాలా చైతన్యం కలిగిస్తున్నాయన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1800102 7222, 1098కు ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్, సీడ్ సంస్థ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రాజు, కోఆర్డినేటర్లు కేయూ చిన్నారావు, గణపతమ్మ పాల్గొన్నారు.


బాల్య వివాహాల నిర్మూలనపై పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, అధికారులు

రెండో రోజు 13,886 ధ్రువపత్రాల పంపిణీ
జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా అర్హులైన వారి వివరాల నమోదు చేసి పథకాలు అందిస్తున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో రోజు సోమవారం జిల్లాలోని 32 గ్రామ సచివాలయాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 13,886 ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందించినట్లు తెలిపారు. జిల్లాలోని 16 మండలాలు, 2 మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమం జరిగిందన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు కృషి

రెండో విడత 79 అక్రిడిటేషన్ల మంజూరు

తుమ్మపాల: జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి తెలిపారు. అక్రిడిటేషన్ కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. వీలైనంత మేరకు హెల్త్‌కార్డులను మంజూరు చేస్తామన్నారు. రెండో విడతగా జిల్లాలోని మరో 79 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో మొదటి విడతలో మంజూరైన అక్రిడిటేషన్లు కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. మొదటి విడతలో 160 మందితో కలిపి మొత్తం 239 మందికి ప్రెస్ అక్రిడిటేషన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బి.ఎస్.వి లోవరాజు, కె.చంద్రారావు, కె.చంద్రశేఖర్, టి.రమేష్, ఎస్.కె చాంద్‌బాషా, గృహ నిర్మాణ శాఖ పీడీ కె.రమామణి, జిల్లా రవాణా శాఖ అధికారి సుజాత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చిన్నమునిస్వామి, డీఐపీఆర్వో కె.ఇంద్రావతి, డీపీఆర్వో సాయిబాబా పాల్గొన్నారు.

విజయనగరం వద్ద రోడ్డు ప్రమాదం

యువకుడి దుర్మరణం

నక్కపల్లి: దేవవరం గ్రామానికి చెందిన ఓ యువకుడు విజయనగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయాలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరూరి కొండబాబు కుమారుడు పేరూరి వెంకటేష్(28) ఆదివారం రాత్రి విజయనగరం సమీపంలో గజపతినగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఐషర్‌వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకటేష్ గజపతినగరం వెళ్తుండగా ఎదురుగా మరో వ్యాన్ వచ్చి ఢీకొనడంతో లారీ క్యాబిన్‌లో చిక్కుకుని బలమైన గాయాలు పాలవడంతో మరణించాడు. గ్రామ వలంటీరుగా పనిచేస్తున్న భార్య మౌనికకు చేదోడు వాదోడుగా ఉంటూ పలు సర్వేలు నిర్వహించడం, జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇంటింట సర్వే చేయడం, లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటి విధులు నిర్వహించేవాడు. అతను మరణించాడన్న వార్త తెలుసుకున్న కుటుంబీకులతో పాటు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్య, రెండేళ్ల వయసు గల కుమారుడు, 8 నెలల వయసు గల కుమార్తె ఉన్నారు. ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారులను, భార్యను అనాథలుగా చేసి వెళ్లిపోయాడంటూ కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


వెంకటేష్ మృతదేహం


వెంకటేష్ (ఫైల్)

అదే ఇంట్లో మళ్లీ చోరీకి యత్నం

కొత్తకోట: సుందరయ్యపేట శివారు ఆనందపురం గ్రామంలో ఒకే ఇంట్లో ఆదివారం రాత్రి రెండోసారి దొంగతనం జరిగింది. సుమారు రెండు నెలల వ్యవధిలోనే ఈ సంఘటన చోటు చేసుకుంది. అయితే ఎటువంటి సొత్తు పోలేదని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆనందపురంలో చుండూరు వెంకట రామకృష్ణ శాస్త్రి ఇంట్లో ఎవరూ ఉండడంలేదు. దీన్ని గమనించిన దుండగులు ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడుతున్నారు. తాజాగా ఇంటి తాళం కప్పలు పగులగొట్టి ప్రవేశించి బీరువా తెరచి చిందర వందర చేసి వెళ్లిపోయారు. శాస్త్రి కుటుంబ సభ్యులు గురు పౌర్ణమికి ఇంటికి వచ్చిన సందర్భంగా తమ ఇంట్లో దొంగలు చొరబడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి సొత్తు పోలేదని ఎస్‌ఐ తెలిపారు. సెల్‌ఫోన్లు అపహరణకు గురైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వేలి ముద్రల నిపుణులు వేలి ముద్రలు సేకరించారు. ఇదే ఇంట్లో సుమారు రెండు నెలల క్రితం ఎవరూ లేని సమయంలో చోరీ జరిగి 50 తులాల వెండి సామాన్లు, 2 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష 30వేల నగదు అపహరణకు గురయ్యాయి. ఆ కేసు కొలిక్కి రాకముందే మళ్లీ తాజాగా దొంగతనం జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఎవరో బాగా తెలిసిన స్థానిక దొంగల పని కావచ్చునని అనుమానిస్తున్నారు. పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టి ఇకపై దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వేలిముద్ర నిపుణులు

స్టీల్‌ప్లాంట్ జీఎం సుధాకర్ మృతి



ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ప్రాజెక్ట్స్ జనరల్ మేనేజర్ (ఐరన్) ఇన్‌చార్జ్ వి.సుధాకర్ గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్లిన ఆయన సోమవారం ఉదయం క్యూ కాంప్లెక్స్ లైనులో ఉండగా గుండెపోటు తీవ్రంగా వచ్చింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని విశాఖకు తీసుకు రానునన్నట్టు సమాచారం. ఆయన శీలానగర్‌లో నివసిస్తున్నారు. సుధాకర్ మృతి పట్ల ఉక్కు వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఉక్కు అధికారుల సంఘం ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసింది.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం


మృతుడు గోవిందరెడ్డి


మృతుడు సత్తిబాబు

నక్కపల్లి: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పాయకరావుపేట మండలం రాజగోపాలపురానికి చెందిన ఉప్పాడ గోవిందరెడ్డి (47)నక్కపల్లిలో ఐరన్ షాపు దగ్గర హెల్పర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తుని నుంచి నక్కపల్లి వస్తుండగా గొడిచర్ల వద్ద వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మరణించాడు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పాయకరావుపేట మండలం పాల్తేరుకు చెందిన దుర్గాప్రసాద్, రాజబాబుకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం కాకినాడ తరలించారు. గోవిందరెడ్డి సోదరుడు వరహాల రెడ్డి ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే సారిపల్లిపాలెం సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. ఎలమంచిలి దగ్గర శేషుకొండ కాలనీకి చెందిన పడాల సత్తిబాబు(24) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సారిపల్లి పాలెం సమీపంలో అకస్మాత్తుగా ఆగిన వ్యాన్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని నక్కపల్లికి ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సి వెంకటరావు తెలిపారు.

300 మంది రోగులకు వైద్య పరీక్షలు

అనకాపల్లి టౌన్: పట్టణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతుభారతి హాలులో భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆ పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఓమ్ని ఆర్‌కే ఆస్పత్రి, శంకర్ ఫౌండేషన్, ప్రముఖ కీళ్ల నరాల వైద్య నిపుణుడు ఆళ్ల వసంతకుమార్ ఆధ్వర్యంలో 300 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తామని రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు దంపతులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్, గౌరీ పీఏసీఎస్ చైర్మన్ కాండ్రేగుల కృష్ణ అప్పారావు, న్యాయవాది డీవీ నర్సింహారావు, మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజీబాబు, పార్టీ నేతలు కొణతాల సత్యనారాయణ, కాండ్రేగుల శ్రీరాం, పెతకంశెట్టి జగన్మోహన్, విల్లూరి రాము, కేఎం నాయుడు, డీఎంఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, దాడి ఈశ్వరరావు, ఆరేపల్లి శ్రీనివాస్ రెడ్డి, మేడిశెట్టి సత్తిబాబు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, పాస్టర్ తిమోతి ధర్మాదాస్ పాల్ పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న దాడి రత్నాకర్

గంజాయితో ఇద్దరు అరెస్టు

కొయ్యూరు: చింతపల్లి మండలం నుంచి పెదవలస, బూదరాళ్ల మీదుగా యర్రవరం నుంచి మైదాన ప్రాంతానికి పది కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రాజారావు తెలిపారు. ముందస్తు సమా చారం మేరకు దొడ్డవరం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమండ్రికి చెందిన షేక్ రిజ్వాన్, చింతపల్లి మండలానికి చెందిన కొర్రా మోహన్ పది కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారు. వారినుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.


పట్టుబడిన గంజాయి, నిందితులు

ఈదురు గాలులు.. భారీ వర్షం

- జిల్లాలో పలు ప్రాంతాల్లో కుండపోత
- విద్యుత్ వైర్లపై కూలిన చెట్లు
- పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- 306.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు


మర్రిపాలెంలో రోడ్డుపై ప్రవహించే వర్షపు నీటిలో వాహనాల రాకపోకలు

తుమ్మపాల: జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల సమయం వరకు జిల్లావ్యాప్తంగా 306.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు సీపీవో జి.రామారావు తెలిపారు. సాధారణ వర్షపాతం 12.71 మిల్లీమీటర్లగా నమోదైందన్నారు.

నాతవరంలో ...
నాతవరం: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. 83.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువుల్లోకి నీరు చేరింది. నాతవరం, మర్రిపాలెం, ములగపూడి, బెన్నవరం, డొంకాడ గ్రామాల్లో భారీ వృక్షాలు కూలి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బెన్నవరంలో భారీ వృక్షం ఓ ఇంటిపై కూలింది. అక్కడే ఉన్న ఆటో ధ్వంసమైంది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. భారీ వర్షం కారణంగా నాతవరం మెయిన్‌రోడ్డు, మర్రిపాలెంలో పెద్ద ఎత్తున నీరు ప్రవహించింది. ఖరీఫ్ సీజన్‌లో వరినారు వేసేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.


ధర్మసాగరంలో పిడుగుపాటుకు మృతి చెందిన పాడిగేదె

నర్సీపట్నంలో ..
నర్సీపట్నం: నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ధర్మసాగరం గ్రామంలో పిడుగుపడి చందక కృష్ణకు చెందిన పాడి గేదె మృతి చెందింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మాకవరపాలెంలో...
మాకవరపాలెం: మండలంలో సుమారు మూడు గంటలపాటు భారీవర్షం కురిసింది లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో 58.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మాకవరపాలెం పంచాయతీ కార్యాలయ ఆవరణతో పాటు పక్కనే ఉన్న ఇళ్లన్నీ నీటితో నిండిపోయాయి.

నీటమునిగిన స్వయం భూ లింగం
మండలంలోని పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలోకి నీరు చేరింది. ఆలయం పక్కనే ఉన్న కొండగెడ్డ పొంగి నీరు ఆలయంలోకి చొచ్చుకుంది. గర్భగుడిలో ఉన్న స్వయం భూ లింగం నీటమునిగింది.

పిడుగుపడి పశువుల పాక దగ్ధం
బుచ్చెయ్యపేట: మండలంలో నీలకంఠాపురం, రాజాం, తైపురం, కందిపూడి, శివరాంపురం, భీమవరం తదితర గ్రామాల్లో ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. పిడుగుల శబ్దానికి పలు గ్రామాల్లో ప్రజలు భయందోళనలకు గురయ్యారు. రాజాంలో పిడుగుపడడంతో యేడువాక అప్పలనాయుడు పశువుల పాక దగ్ధమైంది. పిడుగు పడే సమయంలో పాకలో పశువులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పాకలో ఉన్న ఎరువులు, వ్యవసాయ పరికరాలు, నాటుకోళ్లు కాలిపోయాయి. నీలకంఠాపురం రోడ్డుపై మోకాలి లోతు వరకు వర్షం నీరు చేరడంతో వాహనదారులు, పాదచార్లు ఇబ్బందులు పడ్డారు.

రోలుగుంటలో..
రోలుగుంట: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం గంట పాటు పడింది. రోలుగుంట, కొండపాలెం, బోగా పురం, వెలంకాయలపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

మండలాల వారీగా వర్షపాతం వివరాలిలా ఉన్నాయి.

మండలం	మిల్లీ మీటర్లు
నాతవరం	83.3
కోటవురట్ల	52.5
నర్సీపట్నం	44.3,
రోలుగుంట	26.9
మాకవరపాలెం	26.8
కశింకోట	21.5
బుచ్చయ్యపేట	20.5
పాయకరావుపేట	9.0
రావికమతం	8.4
యలమంచిలి	6.0
గొలుగొండ	1.9
అనకాపల్లి	1.6
ఎస్‌రాయవరం	1.6
మాడుగుల	1.0
సబ్బవరం	0.7
పరవాడ	0.2,
చోడవరం	0.1


నీటిలో మునిగిన గర్భగుడిలోని స్వయం భూ లింగం

క్లుప్తంగా

దర్జీనగర్‌లో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : మండలంలోని బవులవాడ పంచాయతీ పరిధి దర్జీనగర్ గ్రామంలో మంగళవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

చల్లబడిన వాతావరణం

అనకాపల్లిటౌన్ : ఇటీవల వారం రోజులు భానుడు నిప్పులు కక్కుతున్నాడు. ఆషాఢమాసం ఆరంభమై 15 రోజులవుతున్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మబ్బులుపట్టింది. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. 6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్ఏఆర్ఎస్ అధికారులు తెలిపారు.

కశింకోట : కశింకోటలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. వర్షంతో పాటు వీచిన గాలి వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పీఏసీఎస్ ఉద్యోగుల ఆందోళన



ధర్నాలో పాల్గొన్న పీఏసీఎస్ ఉద్యోగులు

అనకాపల్లి రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం పీఏసీఎస్ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో వాటాదారులుగా ప్రైవేట్ వ్యక్తులకు 50 శాతం షేర్లు ఇవ్వవచ్చన్న ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2016 నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను అందజేయాలన్నారు. రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివ రామకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, నాగభూషణం, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, స్వామి, వెంకట్రావ్, త్రినాథ్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

లవ్ యూ రామ్	రాజా
టక్కర్	సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
మాయా పేటిక (ఫస్ట్,సెకెండ్ షో)	షిర్డిసాయి
అశ్విన్స్	పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి(3 ఆటలు)	
నారాయణ అండ్ కో	వెంకటేశ్వర
స్పై	శ్రీసత్య
సామజవరగమన	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 225 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	4,080	4,300
మూడోరకం	3,610	3,910

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 87 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-33 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 405 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

వడివడిగా.. సొంతింటికి చేరేలా..

- జగనన్న లే అవుట్లలో శరవేగంగా నిర్మాణాలు
- నిర్మాణానికి ఆసక్తి చూపకపోతే పట్టాల రద్దు
- వాటిని కొత్త వారికి కేటాయించేలా చర్యలు

పేదల సొంతింటి కల నెరవేరే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. కశింకోట మండలంలో జగనన్న కాలనీల్లో దాదాపు సగం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారుల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపని వారి పట్టాలను రద్దు చేసి, స్థలాల కోసం దరఖాస్తు చేసుకునేవారికి కేటాయించేలా కసరత్తు జరుగుతోంది.



కశింకోటలోని వడ్డి వీధిలో వైఎస్సార్ జగనన్న మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

కశింకోట : మండలంలోని 34 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 1,655 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటికే వీటిలో 806 ఇళ్లు పూర్తి అయినట్లు అధికారిక సమాచారం. మిగిలినవి వీలైనంత వేగంగా పూర్తి చేయడానికి లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. చెల్లింపులు కూడా వేగవంతం చేశారు. బిల్లు పెట్టిన వారం రోజుల్లోగా చెల్లింపులు చేస్తున్నారు. ఇసుక, ఇనుము తదితర నిర్మాణ సామగ్రిని సత్వరమే అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. లే అవుట్లలో ఇళ్లకు విద్యుత్, నిర్మాణానికి కావలసిన నీటి సదుపాయాలను కల్పించారు. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణాలు సాగిస్తున్నారు.

ఆ ఐదు లేఅవుట్లలోనే అధిక నిర్మాణాలు

మండలంలో ఉన్న అన్ని జగనన్న లే అవుట్లలో కశింకోటలో ఉన్న ఐదు లే అవుట్లలో అత్యధిక ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. ఇక్కడి లే అవుట్లలో 508 మందికి ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో ఇప్పటికే 315 ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది.

– కశింకోటలోని వడ్డివీధిలో 3వ సచివాలయం పరిధిలో ఉన్న లే అవుట్ అతి పెద్దది. ఇక్కడే మండలం మొత్తం మీద అత్యధిక ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది. ఇక్కడ 308 మందికి ప్లాట్లు ఇచ్చారు. వీటిలో 168 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

– తేగాడ గ్రామం లే-అవుట్లో తేగాడతోపాటు పేరంటాలపాలెం, జోగారావుపేట, కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాలకు చెందిన 177 మంది లబ్ధిదారులకు స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఉత్సాహంగా నిర్మించుకుంటున్నారు. ఇక్కడ 80 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం పూర్తయింది.

– నూతలగుంటపాలెం లే అవుట్‌లో స్థానికులతోపాటు ఏనుగుతుని గ్రామస్తులకు కలిపి 89 ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో సగానికి పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి అయింది.

– గొబ్బూరులో 54 ఇళ్లకు 40, బయ్యవరంలో 62 ఇళ్లకు సగం ఇళ్లు పూర్తి అయ్యాయి. జి.భీమవరం, ఏఎస్ పేట, జమాదులపాలెం, తాళ్లపాలెం, తీడ, ఉగ్గినపాలెం, వెదురుపర్తి లే అవుట్లలో కూడా అడపా దడపా ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి.

మండల అధికారులు వారానికి ఒకసారి లేఅవుట్లను సందర్శించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసేలా ప్రోత్సహిస్తున్నారు. ఇవే కాకుండా సొంత స్థలాలున్న వారికి మంజూరు చేసిన 466 ఇళ్ల నిర్మాణం కూడా త్వరితగతిన జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో ఇప్పటికే చాలా మంది గృహ ప్రవేశాలు చేసి నివాసం ఉంటున్నారు. లేఅవుట్లలో విద్యుత్ సదుపాయం కల్పించి ఉచితంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

లే అవుట్లు దూరం కావడంతో...

మండలంలోని ఐదు లేఅవుట్లలో అధికారులు స్థానికుల అభిప్రాయాలతో సంబంధం లేకుండా వ్యవహరించారు. అనాలోచితంగా లబ్ధిదారుల గ్రామాలకు దూరంగా లే అవుట్లువేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రాని పరిస్థితి. దీంతో చింతలపాలెం, జి.భీమవరం శివారు సింగవరం, అడ్డాం, సుందరయ్యపేట శివారు వెంకన్నపాలెం, రామన్నపాలెం లే అవుట్లు చాలా వరకు నిరుపయోగంగా మారాయి. వాటి స్థానంలో ప్రత్యామ్నాయంగా తమకు దగ్గర్లో లే అవుట్లు వేసి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దూరం కావడంతో లబ్ధిదారులు ముందుకురాక ఖాళీగా ఉన్న సింగవరం లేఅవుట్

నిర్మాణాలు చేపట్టనివారి పట్టాలు రద్దు

మండలంలోని జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దాదాపు 49 శాతం వరకు నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మిగిలిన లబ్ధిదారుల్ని నిర్మాణాల వైపు ప్రోత్సహిస్తున్నాం. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు జాప్యం లేకుండా వారం వ్యవధిలోనే చెల్లింపులు జరుపుతున్నాం. మెటీరియల్ సకాలంలో అందిస్తున్నాం. ఇళ్ల నిర్మాణం చేపట్టని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి కొత్తగా స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– వి.శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ, కశింకోట

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

- సీఎం జగన్ పాలనతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : సంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు వృథా చేస్తున్నారన్న ప్రతిపక్షాల నోళ్లు మూతపడుతున్నాయని, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలకు పెరిగిన విశ్వాసమే దీనికి కారణమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి మర్రిపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల్ని ఆరా తీశారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను అందిస్తూ, అర్హులైన వారెవరైనా పథకాలు అందుకోని ఎడల తక్షణమే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఈ సందర్భంగా కొందరు వృద్ధులు మంత్రితో మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్‌తో సహా పథకాలన్నీ తమ ఇళ్ల వద్దకే తెచ్చి, ఇస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వాన్ని తామెప్పుడూ చూడలేదని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలో దోబీఖానా కావాలని స్థానికులు మంత్రిని కోరడంతో, అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనతో నిజం చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, కోడూరు గ్రామ సర్పంచ్ సేనాపతి లక్ష్మీశ్రీనివాస్, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దోమల నియంత్రణ



డెంగ్యూ నివారణ మాసోత్సవాలను ప్రారంభిస్తున్న వరహాలు, వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : డెంగ్యూ నివారణ మాసోత్సవాలు ఈ నెల 31 వరకూ నిర్వహించనున్నట్లు జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర అన్నారు. మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రింగ్ రోడ్డులో ర్యాలీని జెడీ్స కె.వెంకటరమణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరహాలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చని పేర్కొన్నారు. దోమల నియంత్రణతోనే డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి తదితర రోగాల నివారణ సాధ్యమవుతుందన్నారు. జెడీ్స వెంకటరమణ మాట్లాడుతూ వాడకపు నీటి తొట్టిలను ప్రతి మూడవరోజు ఖాళీ చేసి, మరలా నింపుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, వాడిపాడేసిన టైర్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మలేరియా విభాగం అధికారి జీజేఎంఆర్‌పీ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి కిటికీలకు, డోర్లకు దోమలు చొరబడలేని మెస్సులను బిగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా విభాగం సబ్‌యూనిట్ అధికారులు ఐ.శ్రీనివాసరావు, ఆర్.వి.నాగేశ్వరరావు, అశోక్, జీవీఎంసీ హెల్త్ అసిస్టెంట్ గణేష్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



షిర్డిసాయి మందిరంలో అన్నసమారాధన చేస్తున్న దాడి రత్నాకర్ దంపతులు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో గురుపౌర్ణిమ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో షిర్డీసాయి మందిరాలు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. స్థానిక వేల్పులవీధి షిర్డీసాయినాథ్ మందిరంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ బాబాను దర్శించుకున్నారు. మండలంలోని ఎన్జీవోస్ కాలనీలో షిర్డీసాయిబాబా మందిరంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, పార్టీ నేతలు మేడిశెట్టి సత్తిబాబు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, విల్లూరి రాజశేఖర్, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని పలు చోట్ల గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తేగాడలో వెలసిన దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. చింతలపాలెం, సోమవరం, కశింకోటలోని కోనేరు వద్ద, గవరపేటలోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచే భక్తులు మందిరాల ముందు బారులుతీరారు.

ఎంఈవో-1గా దివాకరరావు బాధ్యతల స్వీకరణ



పరవాడ: మండల విద్యాశాఖాధికారి-వన్‌గా ఎం.దివాకరావువు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అరకు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేశారు. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో పరవాడ ఎంఈవో-వన్‌గా వచ్చారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం.

శభాష్ వలంటీర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆదిలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జగదీశ్వరి

మునగపాక: వలంటీర్లు తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. వాడ్రాపల్లి సచివాలయ పరిధిలోని శెట్టి అదిలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో జూలై నెల పింఛన్‌ను వలంటీర్ బి.జగదీశ్వరి కేజీహెచ్‌కు వెళ్లి సోమవారం అందజేశారు. వలంటీర్ జగదీశ్వరి సేవలను సర్పంచ్ నూకరాజు, ఎంఎల్‌వో సంజయ్, ఎంపీడీవో మన్మథరావు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ తదితరులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి తపాలా ఉద్యోగుల ధర్నా



ఉడ్‌పేట తపాలా కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్ : తపాలాశాఖలో ఏడాది సర్వీసు పూర్తి చేసుకున్న జీడీఎస్‌లను పోస్టుమన్/ఎంటీఎస్ పరీక్ష వ్రాయుటకు అవకాశం కల్పించాలని ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ పోస్టుమన్ అండ్ ఎంటీఎస్ కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఉడ్‌పేట తపాలా కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టుమన్ అండ్ ఎంటీఎస్ కేడర్ రివ్యూ జరగాలని, అశాస్త్రీయమైన బిజినెస్ టార్గెట్స్, నూరుశాతం డెలివరీ పేరుతో వేదింపులు ఆపాలని, ఎస్‌పీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజారావు, సర్కిల్ వ్యవస్థాపక కార్యదర్శి బి.నూకరాజు, సహాయక కార్యదర్శి కృష్ణంరాజు, సర్కిల్ మాజీ అధ్యక్షుడు కె.మనోహర్, ప్రతినిధులు కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సీఐటీయూ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి రూరల్ : అచ్యుతాపురం సెజ్‌లోని సాహితి ఫార్మా ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపి, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సాహితి ఫార్మా ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు డిమాండ్ చేశారు. తరచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు. ఇందులో సీఐటీయూ ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, కూండ్రపు సోమునాయుడు, పి.మాణిక్యం, దాకారపు దార వరలక్ష్మి, సుధ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి



పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగిన నిర్వాసిత గ్రామాల కార్మికులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ప్రత్యేక ఆర్థిక మండలిలోని అర్జి పరిశ్రమలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు సోమవారం పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు భూములు, ఇళ్లు ఇచ్చి ఉపాధి కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. నిర్వాసితులకు ఆర్ కార్డులు మంజూరు చేసినా ప్రయోజనం లేకుండా పోతుందని గనిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇల్లపు ప్రసాద్ హెచ్చరించారు.

చర్చలు సఫలం

అనంతరం కార్మిక నాయకులు, యాజమాన్య ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. నిర్వాసిత కార్మికులను పర్మినెంట్ చేసి విధుల్లోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించడంతో కార్మికులు ఆందోళన విరమించారు. సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సిరపరపు సురేష్ బందోబస్తు నిర్వహించారు. చర్చల్లో కార్మిక నాయకులు ఇల్లపు వాసు, బొద్దపు చిన్నారావు, బి.రామగోవిందరావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పరవాడ: మండలంలోని పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ బోయిమాంబ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన దివంగత బండారు సంతయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బండారు శరణ్‌కుమార్ దంపతులు రూ. 50,116 విరాళం ఇచ్చారు. ఆలయ నిర్వాహకులకు సంబంధిత నగదు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బండారు బోయన్న, పైల అప్పారావు, కప్పరాడ శ్రీను, కూండ్రపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా సేవలు



లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



దరఖాస్తుదారుకు ధ్రువపత్రాలందిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

- జగనన్న సురక్షలో 585 మందికి ధ్రువపత్రాల అందజేత

అనకాపల్లిటౌన్ : జగనన్న సురక్ష పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని మార్టూరు గ్రామంలో ఎంపీడీవో కె.వి.నరసింహరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ పథకాలు అందలేదనే పరిస్థితి ఉండరాదనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మేలు జరిగినప్పుడే ప్రభుత్వానికి, అధికారులకు మంచిపేరు వస్తుందన్నారు. సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని జగనన్న సురక్ష యాప్‌లో అప్‌లోడ్ చేసిన వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. జగనన్న సురక్షలో 11 రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రామంలో 585 మంది దరఖాస్తుదారులకు వివిధ రకాలైన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు జగనన్న సురక్ష స్పెషల్ అధికారి, ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ మార్టూరు గ్రామంలో లబ్ధిదారుతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎపీటీసీ ఎం.రాజారావు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : గ్రామస్థాయిలో అపరిష్కృతంగా వున్న సమస్యలు పరిష్కారానికి, సకాలంలో ధ్రువపత్రాల మంజూరు తదితర అంశాలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక రక్షణగా వుంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు చెప్పారు. సోమవారం ఇక్కడ సచివాలయం-2లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురికి అధికారులు జారీ చేసిన ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, కరణం నాయుడు, తహసీల్దార్ గంగాధరరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం

అనకాపల్లిటౌన్ : ఏపీలో బీసీలందరూ ఐక్యంగా ఉండాలని ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణమండపంలో ఏఐబీసీఏ వ్యవస్థాపక కార్యదర్శి ఆల్విన్ రాజు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాధికారం కోసం బీసీలంతా ఒకే తాటిపైకి వచ్చి స్థానికంగా ఉన్న బీసీ నాయకులను చట్ట సభలకు పంపిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 76 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల వారున్నారని, ఐక్యంగా పని చేసి రాజ్యాధికారానికి కృషి చేయాలన్నారు. తొలుత ఆలిండియా బీసీ ఫెడరేషన్ ఏపీ విభాగానికి జనరల్ సెక్రటరీగా నియమితులైన మధుసూదనరావుని అభినందించారు. సమావేశంలో స్థానిక బీసీ కార్పొరేటర్లు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు దామోదర్, బీసీ నేతలు వేగి బాబూరావు, మొల్లి రమణబాబు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే రాణింపు



మాట్లాడుతున్న ప్రముఖ సైకాలజిస్టు గంపా నాగేశ్వరరావు

మునగపాక : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే సరైన ప్రణాళిక అవసరమని ప్రముఖ సైకాలజిస్టు గంపా నాగేశ్వరరావు అన్నారు. తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని, అటువంటి విద్య ఇక్కడ దొరకడం సంతోషకరమని అన్నారు. 21వ శతాబ్దపు ఆధునిక విద్యా విధానంపై అవగాహన కల్పించారు. ఒత్తిడి లేని చదువు శ్రేయస్కరమని, పిల్లల అభీష్టాలకు అనుగుణంగా చదివించడం ద్వారా మంచి భవిష్యత్ సొంతమవుతుందని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ జె.రమాణాజీ, ప్రిన్సిపాల్ మీనా మిత్రా, డీన్ సూరిబాబు పాల్గొన్నారు.